అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- మారేడుమాక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



మారేడుమాక గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించి, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రధాన రహదారి మార్గం వెంబడి డ్రెయినేజీ నిర్మాణం, రోడ్డు పక్కనే ఉన్న శ్మశానవాటిక కనిపించకుండా ప్రహరీ నిర్మాణం, రైతుభరోసా వర్తింప చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే సమీక్షించి పరిష్కారానికి అంచనాలను రూపొందించాలని ఆదేశించారు.

ప్రజల్లో పెరిగిన సంతృప్తికర స్థాయి....

ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజల సంతృప్తికర స్థాయి పెరిగిందన్నారు. అన్ని వర్గాలకూ రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. పాలనలో దేశానికే స్ఫూర్తిదాయకంగా జగనన్న నిలిచారన్నారు. ప్రతిపక్షాలు, ఒక వర్గం మీడియా ప్రభుత్వంపై అక్కసుతో బురద చల్లుతున్నాయని మండిపడ్డారు. ప్రజలే తగిన గుణపాఠం చెప్పి, మరోమారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సిహెచ్ ఆదర్శకుమార్, ఎంపీటీసీ ఉప్పలూరి శాంతి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, అగ్రి బోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, సర్పంచ్‌లు మేరుగు విజయ చంద్రశేఖర్, జుజ్జవరపు ఎలీషా, పిన్నబోయిన శ్రీనివాస్, బాయిరెడ్డి నాగరాజు, పార్టీ నాయకులు నెరుసు సతీష్, వీర్ల మోహన్‌రావు, వీర్ల జగదీష్, లాం సురేష్, కె.సీతారామయ్య, కలపాల వజ్రాలు, లంక వెంకయ్య, దండాబత్తిన సుబ్బారావు, రామకృష్ణ, కొలుసు పద్మరాజు, వీరంకి నరేష్, తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, ఈఓ సువర్ణలక్ష్మి, వీఆర్‌ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరుస్తున్న జాతీయ నాయకుల చిత్రాలు



గోడలపై చిత్రీకరించిన నాయకుల ఫొటోలు చూపుతున్న అధ్యాపకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థ జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాల గోడలపై జాతీయ నాయకుల చిత్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మహాత్మగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ సహా పలువురు స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాలు పాఠశాల గోడలపై అబ్బురపరుస్తున్నాయి. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన మహనీయుల జీవిత చరిత్రలు నేటితరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలనే ఉద్దేశంతో చిత్రాలను గీయించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు సంజయ్‌కుమార్ నేతృత్వంలో విద్యార్థులు జాతీయ నాయకుల చిత్రాలను చక్కాగా గీశారని చెప్పారు. విద్యార్థుల్లో సహనం, శాంతి, అహింస, మానవత్వం, పెద్దల పట్ల గౌరవం, సమాజంపై బాధ్యత, దేశభక్తి పెంపొందించేందుకు ఈ చిత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అందరినీ ఆకట్టుకునే విధంగా జాతీయ నాయకులు చిత్రాలు గీసిన విద్యార్థుల చిత్రలేఖన నైపుణ్యాన్ని తల్లిదండ్రులు, స్థానికులు మెచ్చుకుంటున్నారు.

కొరియర్ బాయ్ బ్యాగ్ చోరీ

పెనమలూరు: కొరియర్ బాయ్ లగేజీ బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎనికేపాడుకు చెందిన ఎం.బుజ్జిబాబు కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. పోరంకి సీతాపురంకాలనీలో పార్శిల్ డెలివరీ చేయటానికి వచ్చాడు. బైక్‌తో పాటు లగేజీ బ్యాగ్‌ను ఇంటి బయట ఉంచి ఒకరికి పార్శిల్ ఇవ్వటానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌కు ఉంచిన లగేజీ బ్యాగ్‌ను చోరీ చేశారు. లగేజీ బ్యాగ్‌లో 21 రకాల వస్తువులు ఉన్నాయని వాటి విలువ రూ.2.20 లక్షలు ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

డీపీఎస్‌కు ఉత్తమ పాఠశాలగా అవార్డు



రామవరప్పాడు : విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు బాల, బాలికల డే కమ్ బోర్డింగ్ పాఠశాలల విభాగంలో రాష్ట్రంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందని పాఠశాల ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడ్యుకేషన్ వరల్డ్ నిర్వహించిన ఈ సర్వేలో ఉత్తమ ఫలితం సాధించినందుకు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ ఈ అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు. 2013 నుంచి ఈ పాఠశాల మొదటి స్థానాన్ని పొందుతుందని వివరించారు.

ది సెవెన్ సీక్రెట్స్ టు సక్సెస్ పుస్తకావిష్కరణ



గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత అధికారి జాలాది రత్నసుధీర్ రచించిన ది సెవెన్ సీక్రెట్స్ టు సక్సెస్ పుస్తకాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఆవిష్కరణ జరిగింది. విద్యార్థులకు, యువకులకు ఉపయోగపడే విధంగా పుస్తకాన్ని రచించిన రత్నసుధీర్‌ను వెంకయ్యనాయుడు అభినందించారు.

రేపు వైద్య శిబిరం

గన్నవరం: విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో ఈ నెల 16వ తేదీన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు తెలిపారు. మాక్సివిజన్ కంటి ఆస్పత్రి, కృష్ణ సాయి దంత వైద్యశాల, ఈఎస్ఐ వైద్యుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

తెంపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా నిర్వహించారు. గ్రామంతో పాటు సమీపంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న పరిశ్రమల వద్దకు వెళ్లిన ఆరోగ్య సిబ్బంది అక్కడ నివసించే కుటుంబాలకు సైతం వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితులను నమోదు చేశారు. తెంపల్లిలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంకు రావాలని, నిపుణులైన వైద్యులచే మరలా పరీక్షించి మందులు అందజేస్తామన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



అలంకరణలో రాజరాజేశ్వరిదేవి అమ్మవారు

పెనమలూరు: మండలంలోని పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న విజయరాజరాజేశ్వరి, విజయసుందరేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాద్రపద అమావాస్య సందర్భంగా ఉదయం 8 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి చండీ హోమం నిర్వహించారు. భక్తుల పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి ఆలయంలో ఆదివారం నుంచి శరన్నవరాత్రులు నిర్వహించనున్నారు. 15వ తేదీన బాలత్రిపురసుందరిదేవి, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణదేవి, 18న మహాలక్ష్మిదేవి, 19న లలితాత్రిపురసుందరిదేవి, 20న సరస్వతీదేవి, 21న దుర్గాదేవి, 22న మహిషాసురమర్థినిదేవి, 23న విజయరాజరాజేశ్వరిదేవి అలంకరణ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో ప్రతి రోజు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

నేటి నుంచి షిరిడీ సాయిబాబా మందిరంలో దసరా నవరాత్రులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో దసరా పండుగ సందర్భంగా దేవి శరన్నవరాత్రులు, బాబావారి 105వ పుణ్య తిథి ఉత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు భీమవరపు సుబ్బారెడ్డి తెలిపారు. 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని బాబావారి ఆశీస్సులు పొందాలని కోరారు. చెరువు సెంటర్లోని దుర్గాదేవి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. శ్రీచంద్రమానేన శ్రీశోభకృత్ నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుంచి దశమి వరకు అమ్మవారికి అలంకారాలతో కూడిన పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

నేటి నుంచి శరన్నవరాత్రులు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో దసరా పండుగ సందర్భంగా ఆదివారం నుంచి శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు. 15వ తేదీన పార్వతీదేవీ అమ్మవారిని శైలపుత్రికాదేవిగా అలంకరిస్తామన్నారు. 16న బ్రహ్మచారిణి, మంగళవారం చంద్రఘంటాదేవి, బుధవారం కై ష్మాండదేవి అలంకరణ చేస్తామన్నారు. గురువారం స్కందమాతదేవి, శుక్రవారం కాత్యాయనిదేవి, శనివారం కాళరాత్రి దేవి, ఆదివారం మహాగౌరీదేవి, సోమవారం సిద్ది దాత్రిదేవి, మంగళవారం రజతకవచదేవీగా అలంకరణ చేస్తామన్నారు. భక్తులు అమ్మవారి దివ్య అలంకరణ దర్శనం చేసుకోవాలని ఈవో గంగాధరరావు తెలిపారు.


స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



భవానీపురం: విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించి తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని విజయవాడ నార్త్ రీజియన్ అగ్నిమాపక సేవల అదనపు డైరెక్టర్ జి.శ్రీనివాసులు అన్నారు. పోరంకి భాష్యం బ్లూమ్స్ క్యాంపస్‌లో శనివారం జరిగిన ఇంటర్ హౌస్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని భాష్యం బ్లూమ్స్ జడ్ఈఓ వరలక్ష్మి పర్యవేక్షించగా ప్రిన్సిపాల్ సునీత పాల్, వైస్ ప్రిన్సిపాల్ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటితో ప్రజారోగ్యం వృద్ధి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: సురక్షిత తాగునీటితో ప్రజారోగ్యం వృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్ వితరణతో రూ.1.50 లక్షలు అంచనా వ్యయంతో ఏర్పాటుచేసిన డైరెక్ట్ పంపింగ్ బోరును శనివారం ఎమ్మెల్యే పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీజన్ ఏదైనా తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినందనీయమని చెప్పారు. సేవాభావాన్ని అలవర్చుకోవాలని, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించుకోవటానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్, ఎంపీటీసీ ఉప్పలూరి శాంతి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌తో ఒత్తిడికి ఉపశమనం

నున్న(విజయవాడరూరల్): విద్యార్థులు భయాందోళనలు, టెన్షన్ నుంచి బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్ ద్వారా ఉపశమనం లభిస్తుందని యోగా గురువు దీప్తి తుమ్మూరి తెలిపారు. నున్న గ్రామంలోని వికాస కళాశాలలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం శనివారం కౌన్సెలింగ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దీప్తి మాట్లాడుతూ ప్రస్తుత యువత సెల్ ఫోన్‌కు ఎడిక్ట్ అయ్యి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటుందని చెప్పారు. వాటి నుంచి ఉపశమనం పొందాలంటే బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్ వైపు దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె కొన్ని ప్రక్రియలతో పాటు బ్రీతింగ్ ఎక్సర్‌సైజెస్, చైతన్య క్రియా ధ్యానం చేయించారు. వికాస్ విద్యా సంస్థల అకడమిక్ అడ్వైజర్ ఎస్.కీర్తిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే అన్ని విషయాలపై పట్టు ఉండాలని పేర్కొన్నారు. ప్లేస్‌మెంటు ఆఫీసర్ కిషోర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: గుణదల-రంగన్నగూడెం 132 కేవీ విద్యుత్ లైను మరమ్మతుల కారణంగా ఈ నెల 15వ తేది నుంచి 18 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జయకర్ రాయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుణదలలోని 220 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నుంచి రంగన్నగూడెం సబ్‌స్టేషన్‌కు వచ్చే 132 కేవీ లైనుకు శరవేగంగా మరమ్మతులు పూర్తి చేసేందుకు ఏపీ ట్రాన్స్‌కో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యుత్ లైనుకు తాత్కాలికంగా సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

వరిగడ్డి వామి దహనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని ఆర్పీహెచ్ కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకురాలు, పంచాయతీ వార్డు సభ్యురాలు దూసరి రంగమ్మకు చెందిన వరిగడ్డి వామును గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. రంగమ్మ ఇంటి ప్రాంగణంలో ఉన్న మూడు ఎకరాల వరిగడ్డి వాముకు అగంతకులు శనివారం నిప్పు అంటించారు. అగ్ని జ్వాలలు ఎగసి పడటంతో స్థానికుల సహాయంతో రంగమ్మ, చిన్నప్ప దంపతులు మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. రూ.20 వేలు ఆస్తి నష్టం కలిగినట్లు బాధితులు వాపోయారు. ఈ ఘటనపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. గతంలోనూ దూసరి రంగమ్మ సోదరి అయిన గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల కుటుంబానికి చెందిన వరి పొలంలో ధాన్యం కుప్పలకు నిప్పు అంటించటం, వారి ఇంటి ప్రాంగణంలోని పశువులకు విషపూరిత ఆహారం ఇవ్వటం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజా సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు

పెనమలూరు: తల్లిదండ్రులు మందలించారని ఇంటర్ చదువుతున్న విద్యార్థి ఇంటి నుంచి అదృశ్యమవ్వటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... వణుకూరు గ్రామంలో ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తున్న రమేష్‌బాబు కుమారుడు నివాస్ ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్‌లో ఉండే మిత్రులు ఆన్‌లైన్‌లో గడియారం బుక్ చేయమని నివాస్‌కు రూ.1600 ఇచ్చారు. ఇంట్లో కుమారుడి వద్ద సొమ్ము చూసిన తల్లి సొమ్ము ఎక్కడిదని ప్రశ్నించగా మిత్రుల గడియారం విషయం చెప్పాడు. కాలేజీకి చదువుకోవటానికి వెళుతున్న నీకు ఈ విషయాలు ఎందుకని తల్లి సున్నితంగా మందలించింది. శనివారం ఉదయం నివాస్ ఇంట్లో రూ.6 వేలు తీసుకోని లక్ ఉంటే మళ్లీ కలుస్తా మమ్మీ అని లెటర్ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

పెనమలూరు: ప్రేమించి పెళ్లి చేసుకొని మోసగించిన భర్తతో పాటు అత్తింటివారి పై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు కౌండల్యనగర్‌కు చెందిన అంద్రాజు వసుంధరను అదే గ్రామానికి చెందిన నాగరాజు ప్రేమించి గత కొద్ది సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. కొద్ది కాలం కాపురం చేసి వసుంధరను వదిలేశాడు. అయితే గతంలోనే మరో మహిళను వివాహం చేసుకోని తనను మోసం చేశాడని వసుంధర భర్త నాగరాజును నిలదీసింది. దీంతో నాగరాజు, మొదటి భార్య భూలక్ష్మి, అత్త భాగ్యలక్ష్మి, మరిది సుబ్బారావు కలిసి వసుంధరను బెదిరించి వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

బ్యాంకు ఖాతాలో సొమ్ము మాయం

పెనమలూరు: వ్యక్తి బ్యాంకు ఖాతాలో గుర్తు తెలియని వ్యక్తులు సొమ్ము స్వాహా చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం... పోరంకి గ్రామానికి చెందిన పరిమి శ్రీరంగనాయకులుకు కానూరులో యాక్సస్ బ్యాంకులో ఖాతా ఉంది. ఆయనకు ఈ నెల 11వ తేదీన ఫోన్ మెసేజ్ వచ్చింది. బ్యాంకు ఖాతాను అప్‌డేట్ చేయాలని మెసేజ్‌లో తెలిపారు. దీంతో 12వ తేదీన అతనికి వచ్చిన లింక్ ఓపెన్ చేసి వివరాలు ఇచ్చాడు. ఓటీపీ రావటంతో దాని వివరాలు కూడా తెలిపారు. వెంటనే ఆయన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.2 లక్షలు గుర్తు తెలియని వ్యక్తికి బదిలీ అయ్యాయి. జరిగిన మోసం పై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పౌష్టికాహారం పంపిణీ

పెనమలూరు: హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి గైడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. పోరంకి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఐవీతో బాధపడుతున్న 25 మందికి పులి రాఘవేంద్రరావు, లలితకుమారి సహకారంతో పౌష్టికాహారం అందించారు.